క్లుప్తంగా

సుంకర చలపతిరావుకు కళారత్న అవార్డు



సీఎం నుంచి పురస్కారం అందుకుంటున్న చలపతిరావు

మల్కాపురం: ప్రముఖ చిత్రకారుడు సుంకర చలపతిరావుకు మరో ప్రతిష్టాత్మక అవార్డు దక్కింది. శ్రీ విశ్వావసు నామ సంవత్సర ఉగాదిని పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం ఆయనకు కళారత్న అవార్డు ప్రకటించింది. ఈ మేరకు ఆదివారం విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో రాష్ట్ర సృజనాత్మకత, సాంస్కృతి సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేతులమీదుగా చలనతిరావు కళారత్న అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయనకు పలువురు అభినందనలు తెలిపారు.

ఆర్వోప్లాంట్ బహూకరణ



ఆర్వో ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న గంట్ల, జేసీఐ ప్రతినిధులు

గోపాలపట్నం: నిరాశ్రయులను ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వాలతో పాటు సమాజంలో ప్రతి ఒక్కరిపైనా ఉందని నేవల్ డాక్‌యార్డు అసోసియేషన్(కేటీబీ) గౌరవ అధ్యక్షుడు గంట్ల శ్రీనుబాబు పేర్కొన్నారు. 90వ వార్డు బుచ్చిరాజు పాలెంలోని పట్టణ నిరాశ్రయుల వసతి గృహానికి జేసీఐ వాల్తేరు యూనిట్ అందించిన ఆర్వో ప్లాంట్‌ను శ్రీనుబాబు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ నిరుపేదలకు సహాయం చేసేందుకు జేసీఐ ముందుకు రావడం ప్రశంసనీయమన్నారు. జేసీఐ వాల్తేరు అధ్యక్షుడు వేముల శ్రావణ్‌కుమార్ మాట్లాడుతూ వసతి గృహంలో ఆర్వో ప్లాంట్ పనిచేయడం లేదని తమ దృష్టికి రావడంతో ఉగాది రోజు అందజేశామన్నారు. కార్యక్రమంలో జేసీఐ కార్యదర్శి కె.వి.వి.కృష్ణ, గౌరవ అతిథి సిద్ధికి, రూపా సరిపురి, దిలీప్ కుమార్, మిత్ర తేజా, సింధూష తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం



మజ్జిగ పంపిణీ చేస్తున్న పీఎస్‌కే మూర్తి, ఆర్‌వీ రమణ తదితరులు

మద్రిపాలెం: మాధవధార, వంశీనగర్ సర్వీసు రోడ్డులో ఆదివారం ఉగాది సందర్భంగా చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో హిందుస్థాన్ షిప్‌యార్డ్ లిమిటెడ్ గుర్తింపు యూనియన్ ఐఎన్‌టీయూసీ జనరల్ సెక్రటరీ పీఎస్‌కే మూర్తి, జనరల్ మేనేజర్ ఆర్.వి. రమణలు పాల్గొని చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, వేసవి తాపం పెరుగుతున్న తరుణంలో చలివేంద్రాల ప్రాముఖ్యత పెరుగుతుందన్నారు. స్వచ్ఛంద సంస్థలు, దాతలు చలివేంద్రాలు ఏర్పాటు చేసి పాదచారుల దాహార్తిని తీర్చేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో చలివేంద్రం నిర్వాహకుడు, హిందుస్థాన్ షిప్‌యార్డ్ లిమిటెడ్ ఐఎన్‌టీయూసీ డిప్యూటీ జనరల్ సెక్రటరీ నంబాల ధనుంజయరావు తదితరులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్లపై వేధింపులు ఆపాలి



మాట్లాడుతున్న ఆటో ఫెడరేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి గోవింద్

సీతమ్మధార: స్కూల్ పిల్లల ఆటోలపై పోలీసులు, రవాణా శాఖ అధికారులు పెడుతున్న అక్రమ కేసులు వెంటనే ఆపాలని, కోర్టులో డ్రైవర్లను హాజరు పరిచే విధానాన్ని తక్షణమే రద్దు చేయాలని ఆటో ఫెడరేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పడాల గోవింద్ డిమాండ్ చేశారు. నార్త్ ఎక్స్‌టెన్షన్‌లోని షిర్డీసాయి ఆటోస్టాండ్ జనరల్ బాడీ సమావేశంలో ఆయన డ్రైవర్లను ఉద్దేశించి మాట్లాడారు. కోరారు. స్కూలు పిల్లల ఆటోలకు పది మందికి అనుమతి ఇవ్వాలని, కాలేజీ పిల్లల ఆటోలకు 8 మందికి అనుమతి మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎన్నికల ముందు చంద్రబాబు నాయుడు అధికారంలోకి వస్తే డ్రైవర్లకు రూ. 15 వేలు అందజేస్తామని ఇచ్చిన హామీని వెంటనే అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో స్టాండ్ అధ్యక్షుడు నక్క శీను, ఆవాల చిన్న, పిట్ట చిన్న, ఎస్. గణేష్, రావి అశోక్, పిన్నింటి కృష్ణ నాయుడు పాల్గొన్నారు

ఆటంకాలు

- బిల్లులు చెల్లించకపోవడంతో ఇండోర్ స్టేడియం పనులు నిలిపివేత
- ఏడేళ్లుగా కొనసాగుతున్న స్టేడియం నిర్మాణం
- క్రీడాకారుల నిరుత్సాహం
- త్వరగా పూర్తి చేయాలని వినతి



ఇండోర్ స్టేడియం వ్యూ



గోడలకు ప్లాస్టింగ్ కాని దృశ్యం

మల్కాపురం: జీవీఎంసీ 60వ వార్డు గుల్లలపాలెం వుడా కాలనీలో క్రీడాకారుల కోసం నిర్మిస్తున్న ఇండోర్ స్టేడియం పనులు బిల్లులు విడుదల కాకపోవడంతో మధ్యలోనే నిలిచిపోయాయి. దీంతో క్రీడాకారులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. సుమారు రెండు ఎకరాల స్థలంలో సుమారు రూ.2.80 కోట్లతో ఏడేళ్లుగా ఇండోర్ స్టేడియం నిర్మాణం సాగుతోంది. షటిల్, బ్యాడ్మింటన్ వంటి ఇండోర్ గేమ్స్‌ను అంతర్జాతీయ స్థాయిలో నిర్వహించాలనే ఆలోచనతో అధికారులు ఈ స్టేడియాన్ని నిర్మిస్తున్నారు. ఈ పనులు చేస్తున్న కాంట్రాక్టర్లకు పెద్ద మొత్తంలో బిల్లులు రావాల్సి ఉంది. కూటమి ప్రభుత్వం వచ్చాక కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించడం లేదు. దీంతో చాలా పనులు మధ్యలోనే ఆగిపోయాయి. జీవీఎంసీ అధికారులు సకాలంలో బిల్లులు చెల్లించకపోవడంతో కాంట్రాక్టర్లు స్టేడియం పనులు చేయలేమని చేతులెత్తేశారు.

అసంపూర్తిగా పనులు

స్టేడియంలో గోడలకు ప్లాస్టింగ్ జరగలేదు. ఫ్లోర్‌కు టైల్స్ పనులు కాలేదు. రంగులు వేయలేదు. దీంతో నిర్మాణం అసంపూర్తిగా ఉంది.

క్రీడాకారుల నిరాశ

స్టేడియం నిర్మాణం పూర్తయితే ఇక్కడ ప్రాక్టీస్ చేసుకోవచ్చని ఆశగా ఎదురుచూస్తున్న క్రీడాకారులు నిరుత్సాహానికి గురవుతున్నారు. ఏడేళ్లగా స్టేడియం పనులు జరుగుతున్నా ఇంకా పూర్తి కాకపోవడంపై క్రీడాకారులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.పనులు ఎప్పటికి పూర్తవుతాయో, స్టేడియం ఎప్పటికి వినియోగంలోకి వస్తుందో అని క్రీడాకారులు ఎదురుచూస్తున్నారు.

ఏడేళ్లుగా ఎదురు చూపు

గుల్లలపాలెం వుడాకాలనీ వద్ద ఇండోర్ స్టేడియం ఏర్పాటవుతుందని ఎంతో సంతోషించాం. అయితే ఏడేళ్లవుతున్నా నిర్మాణం పూర్తి కాలేదు. ఈ ప్రాంతం నుంచి ఎందరో క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీ స్థాయిలో సత్తా చాటుకుంటున్నారు. స్టేడియం పూర్తయితే ఎక్కువ మంది క్రీడాకారులు జాతీయ స్థాయిలో రాణించే అవకాశం ఉంది. స్టేడియం పనులు త్వరగా పూర్తి చేసి వినియోగంలోకి తీసుకురావాలి.



–రేష్మాయాదవ్, క్రీడాకారిణి

ప్రభుత్వం ప్రోత్సహించాలి



ఇండోర్ స్టేడియం పూర్తి కాకపోవడంతో ప్రాక్టీస్ కోసం నగరానికి రోజూ వెళ్లాల్సిన పరిస్థితి. అధికారులు ఇప్పటికైనా ఈ సమస్యపై స్పందించి కాంట్రాక్టర్‌కు బిల్లులు చెల్లించి, పనులు వేగవంతంగా జరిగేలా చూడాలి. ఏడేళ్లుగా స్టేడియం కోసం ఎదురు చూస్తున్నాం. పాలకులు క్రీడలను, క్రీడాకారులను ప్రోత్సహించాలి. –మనోజ్‌కుమార్, క్రీడాకారుడు

ఇండోర్ స్టేడియం అభివృద్ధికి కృషి



క్రీడాకారులతో శాప్ చైర్మన్ రవినాయుడు, ఎమ్మెల్యే గణబాబు

గోపాలపట్నం: ఇండోర్ స్టేడియం అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని శాప్ చైర్మన్ రవి నాయుడు అన్నారు. ఆయన గోపాలపట్నం హైస్కూల్ గ్రౌండ్, ఇండోర్ స్టేడియంలను ఆదివారం ఎమ్మెల్యే గణబాబుతో కలసి సందర్శించారు. స్టేడియంలో సమస్యలను గణబాబు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఏసీ సౌకర్యంతో పాటు సోలార్ పవర్ ఏర్పాటు చేస్తే నిర్వహణ భారం తగ్గుతుందని సూచించారు. ఇక్కడి గ్రౌండ్‌ను కూడా అభివృద్ధి చేయాలని కోరారు. దీనిపై స్పందించిన చైర్మన్ మాట్లాడుతూ ఎంతో మందికి ఉపయోగపడుతున్న గ్రౌండ్‌ను అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు.

ఉగాది వేళ .. ఆలయాలు కళకళ



పూజలు అందుకున్న గణనాథుడు



విశేష అలంకరణలో స్వామి



కొత్తపాలెం ప్రసన్న వేంకటేశ్వర స్వామి ఆలయంలో పూజల్లో పాల్గొన్న భక్తులు



పంచాంగ శ్రవణాన్ని ఆలకిస్తున్న భక్తులు

గోపాలపట్నం: ఉగాది పండగ సందర్భంగా పలు ఆలయాలు కిటకిటలాడాయి. అధిక సంఖ్యలో భక్తులు హాజరై ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. శివాలయాల్లో క్షీరాభిషేకాలు, రుద్రాభిషేకాలు నిర్వహించారు. విశ్వావసు నామ సంవత్సరంలో శుభాలు జరగాలని కోరుతూ పూజలు చేశారు. కొత్తపాలెం ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామిని ప్రత్యేకంగా అలంకరించారు. పలువురు భక్తులు ఇక్కడ విఘ్నేశ్వరునికి విశేష పూజలు చేశారు.

ఆలయాల్లో పంచాంగ శ్రవణాలు

గోపాలపట్నం పరిసర ప్రాంతాల్లోని ఆలయాల్లో పంచాంగ శ్రవణాలు నిర్వహించారు. పంచాంగంలో విశ్వావసు నామ సంవత్సరంలో ఏవిధంగా ఉంటుందో పురోహితులను అడిగి తెలుసుకున్నారు.

40వ వార్డులో..

సింథియా: జీవీఎంసీ 40వ వార్డు షిప్‌యార్డ్‌కాలనీలోని షిర్డీ సాయిబాబా మందిరంలో ఆదివారం విశ్వావసు నామ సంవత్సర ఉగాది వేడుకలు ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజాము నుంచి సాయిబాబాకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. ఆలయ ప్రాంగణంలో సాయి నామస్మరణతో ఏర్పాటు చేసిన సాయి గానలహరి భక్తులను అలరించింది. అనంతరం మహాఅన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ ట్రస్ట్ సభ్యులు కుమార్ మాట్లాడుతూ ఈ ఏడాది ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని సాయిబాబాను కోరుకుంటున్నట్లు తెలిపారు.

మల్కాపురం: విశ్వావసు నామ సంవత్సర (ఉగాది)వేడుకలు పారిశ్రామిక ప్రాంతంలో ఆదివారం ఘనంగా జరిగాయి. పలు ఆలయాలకు భక్తులు పోటెత్తారు. మందిరాల వద్ద ఉగాది పచ్చడిని భక్తులకు పంచారు.

- స్థానిక చింతామణి దుర్గాగణపతి ఆలయంలో దుర్గా గణపతికి ఆలయ అర్చకుడు ఉమాశంకర్ ప్రత్యేక పూజలు చేశారు.
- మల్కాపురంలోని నూకాలమ్మ ఆలయానికి భక్తులు పోటెత్తారు. ఆలయ కమిటీ ప్రతినిధులు భక్తులకు ఉగాది పచ్చడి అందించారు.దీంతో అంతటా సందడి నెలకొంది.

తప్పిన ముప్పు



పార్కింగ్ చేసిన స్కూటీని తొక్కేసిన లారీ

అక్కిరెడ్డిపాలెం: షీలానగర్, భెల్ సిగ్నల్ పాయింట్ల వద్ద ఆదివారం రెండు రోడ్డు ప్రమాదాలు సంభవించాయి.రెండు ఘటనల్లో వాహనాలు నుజ్జునుజ్జు అయినా ఎవరికీ గాయాలు కాకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.షీలానగర్ డీ మార్ట్ వద్ద మల్కాపురానికి చెందిన ఒక వ్యక్తి స్కూటీ పార్కింగ్ చేశాడు. ఇదే సమయంలో పార్కింగ్ యార్డు నుంచి వచ్చిన లారీ స్కూటీని ఢీ కొట్టి ఈడ్చుకుపోయింది. ఈ ప్రమాదంలో స్కూటీ పూర్తిగా నుజ్జయింది. ఈ ప్రమాదంలో ఎవరికీ గాయాలు కాకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు. ఈ ప్రమాదంపై స్కూటీ యజమాని గాజువాక ట్రాఫిక్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు.

లారీలు ఢీ

భెల్ సిగ్నల్ పాయింట్ వద్ద ఆదివారం రెండు కంటైనర్ లారీలు పక్కపక్కనే వస్తూ ఢీ కొట్టుకున్నాయి. దీంతో ఒక లారీ క్యాబిన్ పూర్తిగా ధ్వంసం అయ్యింది. పూర్తిగా ట్రాఫిక్ జామ్ కావడంతో లారీని క్రేన్ సహాయంతో రోడ్డుపై నుంచి తొలగించారు. లారీ డ్రైవర్‌కు ఎటువంటి ప్రమాదం జరగకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు.

అప్పన్నకు విశేషంగా ఆర్జిత సేవలు



స్వర్ణపుష్పాలతో ప్రదక్షిణ చేస్తున్న అర్చకులు



నిత్యకల్యాణంలో పాల్గొన్న ఉభయదాతలతో కిక్కిరిసిన కల్యాణ మండపం

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. అధిక సంఖ్యలో భక్తులు ఈ సేవల్లో పాల్గొన్నారు. ఉదయం 7 గంటల నుంచి స్వర్ణ పుష్పార్చన ఘనంగా నిర్వహించారు. ఆలయ కల్యాణమండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేంజేపచేశారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం జరిపారు. 108 స్వర్ణ సంపెంగ పుష్పాలతో అష్టోత్తర శతనామావళి పూజ నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలను అందించారు. ఆలయ సూపరింటెండెంట్ జీవీవీఎస్‌కే ప్రసాద్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

వైభవంగా నిత్యకల్యాణం

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ కల్యాణమండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్ఠింపజేసి, ఉదయం 9.30 నుంచి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణాన్ని జరిపారు. ఉభయదాతలకు స్వామివారి అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రాలను అందించారు.

తల్లికి వందనం ఎక్కడ? 96 గజాల స్థలం ఏదీ?

సీపీఎం నాయకుల ప్రశ్న



జగదాంబ జంక్షన్‌లో వినూత్నంగా నిరసన తెలుపుతున్న సీపీఎం ప్రతినిధులు

డాబాగార్డెన్స్: తల్లికి వందనం ఎక్కడ? 96 గజాల స్థలం ఏదీ? మహిళలకు ఇవ్వాల్సిన రూ.15వేలు ఎవరి ఖాతాలో పడ్డాయి? గ్యాస్ సిలిండర్ల డబ్బులు ఎంత మందికి వచ్చాయి? మహిళలకు ఉచిత బస్సు తుస్సేనా? కరెంటు చార్జీలు పెంచమని చెప్పి మాట తప్పిన అంశం.. స్మార్ట్ మీటర్ల పరిస్థితి ఏంటి? అంటూ ఎన్నో ప్రశ్నలు కూటమి ప్రభుత్వంపై సంధించారు సీపీఎం జగదాంబ జోన్ కమిటీ కన్వీనర్ ఎం సుబ్బారావు. ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని ఆదివారం కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నెరవేర్చకపోవడాన్ని నిరసిస్తూ వినూత్నంగా ప్రదర్శన చేపట్టారు.తొలుత ఉగాది పచ్చడి పంపిణీ చేశారు. సీఐటీయూ నాయకుడు వై. రాజు నేతృత్వంలో కళాఖండాలు ప్రదర్శించారు. జగదాంబ జోన్ ఇన్‌చార్జి పి. మణి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం కల్లబొల్లి మాటలతో అధికారంలోకి వచ్చిందని, 6 గ్యారంటీలు నెరవేరుస్తామని విశాఖ స్టీల్‌ప్లాంట్‌ని ప్రైవేట్‌పరం చేయబోమని, సొంత గనులు ఇప్పించే బాధ్యత తీసుకుంటామని అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం స్టీల్‌ప్లాంట్‌కు సొంత గనుల కోసం మాట్లాడకపోవడం సిగ్గు చేటన్నారు. మిట్టల్ స్టీల్‌ప్లాంట్‌కి సొంత గనుల కోసం ఢిల్లీ చుట్టూ తిరుగుతున్నారని ఎద్దేవా చేశారు. మత్స్యకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కర్రి చంద్రశేఖరం మాట్లాడుతనూ మత్స్యకారుల వేట నిషేధ కాలంలో వారి భృతి రూ.20 వేలకు పెంచుతామని చెప్పి, ఇంత వరకు ఇవ్వకపోవడం, కనీసం సర్వే కూడా చేయకపోవడం దారుణమన్నారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ నాయకులు కె. గణేష్, సంతోష్‌కుమార్, సంజయ్, సిటు నాయకుడు చంద్రమౌళి, భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకుడు కె. నర్సింగరావు, సిమ్మనాయుడు, రామకృష్ణారావు, సూరీడు తదితరులు పాల్గొన్నారు.

రౌడీయిజం చేస్తే పీడీయాక్ట్



రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న ద్వారకా సీఐ రమణ

సీతమ్మధార: రౌడీయిజం చేస్తే పీడీ యాక్ట్ అమలు చేస్తామని ద్వారకా సీఐ డి.వి.రమణ రౌడీషీటర్లను హెచ్చరించారు. స్టేషన్ పరిధిలో పలు కేసుల్లో ఉన్న రౌడీషీటర్లకు ఆదివారం కౌన్సెలింగ్ నిర్వహించి వేలి ముద్రలు, సంతకాలు సేకరించారు. సత్ప్రవర్తనతో మెలగకపోతే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. తగాదాలు, కొట్లాటల్లో తల దూర్చకుండా కుటుంబంతో హాయిగా జీవించాలని సూచించారు. మీరు చేసే పనులపై నిఘా ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఐ శ్రీను, పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

లలితాంబిక నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం



లలితాంబిక



ప్రత్యేక పూజలు చేస్తున్న చిన్నారులు

సబ్బవరం: ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రం దేవీపురంలో లలితాంబిక నవరాత్రి ఉత్సవాలు ఆదివారం ఘనంగా మొదలయ్యాయి. వచ్చే నెల 6 వరకూ నిర్వహించే ఈ ఉత్సలను వేకువ జామున గోమాత పూజతో ప్రారంభించారు. శ్రీచక్రాలయంలోని శ్రీమేరు మొదటి అంతస్తులో అంగ, ప్రత్యంగ, ఉపాంగ దేవతల నవయోని యంత్రములో ఏర్పాటు చేసిన వాసని వాగ్దేవతలను ఆశీనులను చేసి భక్తిశ్రద్ధలతో పూజించారు. తొలి రోజు కార్యక్రమాల్లో భాగంగా మహాగణపతి బాలా త్రిశతి సహిత లలితా హోమం నిర్వహించారు. మధ్యాహ్నం అన్నసమారాధనను గురుమాత అన్నపూర్ణమ్మ ప్రారంభించారు.

సింహగిరికి ఉగాది శోభ



క్యూ కాంప్లెక్స్‌లో స్వామివారి దర్శనానికి వేచిఉన్న భక్తులు



క్యూలో బారులు తీరిన భక్తులు

సింహాచలం: సింహగిరి ఆదివారం ఉగాది శోభని సంతరించుకుంది. శ్రీ విశ్వావసు నామ సంవత్సర ప్రారంభాన్ని పురస్కరించుకుని అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామిని దర్శించుకుని, పునీతులయ్యారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు కొండపైకి భక్తులు పోటెత్తారు. యువత సాంప్రదాయ వస్త్రధారణలో కనువిందు చేశారు. భక్తులతో దర్శన క్యూలన్నీ కిక్కిరిశాయి. ప్రసాద విక్రయశాల, అన్న ప్రసాదశాల వద్ద భక్తులు బారులు తీరారు. రాజగోపురం ఎదురుగా ఉన్న మాడవీధిలో ఫొటోలు తీసుకుంటూ సందడి చేశారు. ఉగాది సందర్భంగా ఉదయం ఆలయంలో స్వామికి విశేష అర్చన, ఉగాది పచ్చడి నివేదన జరిపారు.

బైకుల దగ్ధం ఘటనలో మహిళ అరెస్ట్

అల్లిపురం: శనివారం తెల్లవారు జామున సింగ్‌హోటల్ జంక్షన్ సమీపంలోని గ్రూపు హౌస్ సెల్లార్‌లో బైకుల దగ్ధం కేసులో ఒక మహిళను అరెస్ట్ చేసినట్లు సీఐ ఎర్రంనాయుడు తెలిపారు. అదే గ్రూపు హౌస్‌లో గల ఒక వ్యక్తితో గల వివాదం కారణంగా ఆ మహిళ అతను రెండు రోజుల క్రితం కొనుక్కున్న హోండా షైన్ బైక్‌ను దగ్ధం చేసింది. దీంతో బైక్ పక్కనే గల ఇతర బైకులకు మంటలు వ్యాపించడంతో సుమారు 15 బైకులు దగ్ధమయ్యాయి. సీసీ కెమెరాలను పరిశీలించగా ఘటనకు కారణమైన మహిళను గుర్తించారు. ఆమెను అదుపులోకి తీసుకుని అరెస్ట్ చేసినట్లు తెలిపారు. ఘటన జరిగిన 12 గంటల వ్యవధిలోనే నిందితురాలిని అదుపులోకి తీసుకోవడంతో పోలీస్ కమిషనర్ డాక్టర్ శఖబ్రత బాగ్చి అభినందించారు.

టిడ్కో గృహ సముదాయాల్లో వసతులు కల్పించాలి

అగనంపూడి: జీవీఎంసీ 88వ వార్డు దువ్వాడ, మంగళపాలెం, తలారివానిపాలెం రెవెన్యూ పరిధిలో నిర్మించిన టిడ్కో గృహ సముదాయాల్లో మౌలిక వసతులు కల్పించాలని, ఫ్లాట్లు కేటాయించాలని కోరుతూ ఆదివారం లబ్ధిదారులు ఆందోళన కార్యక్రమం చేపట్టారు. టిడ్కో గృహ సముదాయ ఆవరణలో చేపట్టిన నిరసన కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు కసిరెడ్డి సత్యనారాయణ మాట్లాడుతూ పదేళ్ల కిందట టిడ్కో ఇళ్ల నిర్మాణం చేపట్టారని, ఏడేళ్ల కిందట దాదాపు పనులు పూర్తి చేశారన్నారు. అర్హులను ఎంపిక చేసి డిపాజిట్లు సేకరించినా నేటికీ కూడా రోడ్లు, డ్రైనేజీ, మంచినీటి వసతి, ఔట్‌లెట్, విద్యుత్ సౌకర్యాలు కల్పించకపోవడంతో శిథిలావస్థకు చేరుతున్నాయన్నారు. ప్రభుత్వం నిర్లక్ష్యం వీడి వెంటనే లబ్ధిదారులకు ఇళ్ల కేటాయించాలని డిమాండ్ చేశారు.

అలరించిన విశ్వావ'సుకవి' సమ్మేళనం



కవి సమ్మేళనంలో పాల్గొన్న కవులు

సీతంపేట: విశాఖ రసజ్ఞ వేదిక అధ్యక్షుడు డాక్టర్ గండికోట రఘురామారావు ఆధ్వర్యంలో ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో ఆదివారం జరిగిన విశ్వావసు కవి సమ్మేళనం ఆహుతులను అలరించింది. వ్యాఖ్యాత రాంభట్ల నృసింహశర్మ నిర్వహణలో పలువురు కవులు, రచయితలు ఉత్సాహంగా పాల్గొని తమదైన శైలిలో కవిత్వంతో రంజింపజేశారు. ఈ సందర్భంగా రఘురామారావు మాట్లాడుతూ సాహిత్యం, సంగీతం, కళారూపాలు, భారతీయ సంస్కృతి ప్రజలకు మరింత చేరువ చేయాలనే లక్ష్యంతో కళాతపస్వి కె.విశ్వనాథ్ చేతుల మీదుగా 2010లో విశాఖ రసజ్ఞ వేదిక స్థాపించామన్నారు. గడిచిన 15 ఏళ్లలో 150కి పైగా సాహిత్య, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించినట్టు తెలిపారు. విశాఖ రసజ్ఞ వేదిక 15 ఏళ్ల వైభవాన్ని పురస్కరించుకుని ఉగాది సందర్భంగా విశాఖలోని 24 మంది తెలుగు కవులను సత్కరించి, వారి చేత విశ్వావ'సుకవి' సమ్మేళనం నిర్వహించామన్నారు. ఆచార్య బేతవోలు రామబ్రహ్మం, కోలవెన్ను మలయవాసిని, డి.వి.సూర్యారావు, ద్విభాష్యం రాజేశ్వరరావు, పేరి రవికుమార్, వెలమల సిమ్మన్న, మీగడ రామలింగస్వామి, ఈదర పెదవీర్రాజు తదితరులు కవిత్వంతో అలరించారు.

బొర్రమాంబ జాతర పోస్టర్ ఆవిష్కరణ

ప్రధాన తేదీలు వెల్లడించిన ఉత్సవ కమిటీ



ఉత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఆలయ కమిటీ ప్రతినిధులు

అగనంపూడి: అగనంపూడి పరిసర అష్ట గ్రామాల ఆరాధ్య దైవం, కోరికలు తీర్చే కల్లవల్లి బొర్రమాంబ జాతర వచ్చేనెల 15వ తేదీన నిర్వహించేందుకు నిర్ణయించామని బొర్రమాంబ ఆలయ కమిటీ చైర్మన్ చిత్తా గణేష్ చెప్పారు. పాత అగనంపూడి రామాలయ ఆవరణలో ఆదివారం అమ్మవారి జాతర పోస్టర్‌ను ఉత్సవ కమిటీలు సభ్యులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 8 గ్రామాల ప్రజలు ఇష్టదైవంగా కొలిచే బొర్రమాంబ తల్లి ఉత్సవాల్లో భాగంగా 3వ తేదీన దుర్గాలమ్మ తల్లి జాతర, 8న పరదేశమ్మ తల్లి ఉత్సవం, 10న బొర్రమాంబ పుట్టబంగారు మహోత్సవం, 14న తొలేళ్ల జాతర, కోటి దీపారాధన, 15న అమ్మవార్ని భారీ ఊరేగింపుతో అనుపు చేయనున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో కోల్‌కతా లైటింగ్, సెట్టింగ్స్ ప్రత్యేక ఆకర్షణగా నిలవడంతోపాటు ఉత్తరాంధ్రలోనే ప్రఖ్యాతి గాంచిన బాణ సంచా విన్యాసాలు ఏర్పాటు చేసినట్టు చెప్పారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ, ఉత్సవ కమిటీల ప్రతినిధులు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.